

కొత్త ఆలోచనలు... సంకల్పాలు - 8వ పేజీలో



- గత ఏడాది చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం తప్పనిసరి
- సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకమంటున్న నిపుణులు

హాస్టళ్లకు నిధులు

సాంఘిక సంక్షేమ వసతిగృహాల భవనాలకు మరమ్మతులు

- జిల్లాలో 19 హాస్టళ్లకు రూ.3.16 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం
- విద్యుత్, కార్పెంటరీ, ప్లంబింగ్, సిమెంట్ పనులు
- జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- తొలగనున్న ఎస్సీ విద్యార్థుల ఇక్కట్లు

నర్సీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మంచి రోజులు వచ్చాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని భవనాలకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 19 వసతి గృహాల్లో మేజర్, మైనర్ మరమ్మతు పనులకు రూ.3.16 కోట్లు మంజూరు చేసింది. పనులు చేపట్టడానికి పరిపాలనా పరమైన అనుమతులు జారీ అయ్యాయి. జనవరి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సమగ్ర శిక్ష ఈఈ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తారు.


నర్సీపట్నం ఎస్సీ బాలుర హాస్టల్‌లో పెచ్చులు ఊడిపోయిన భవనం శ్లాబ్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం డీఈఈ సుబ్బలక్ష్మి, ఏఈ రామాంజి

జిల్లాలోని సాంఘిక సంక్షేమ పరిధిలో వున్న ఎస్సీ విద్యార్థుల వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలకు రెక్కలు లేక పోవడంతో శీతాకాలంలో చలి, దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే శ్లాబ్‌ల నుంచి నీరు కారుతున్నది. గచ్చులు చిత్తడిగా మారుతుండడంతో రాత్రిపూట నిద్ర పోవడానికి వీలు కావడలేదు. మరుగుదొడ్లు, స్నానపు గదుల తలుపులు ఊడిపోవడంతో పరదాలు కట్టుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల సమస్యలను పట్టించుకోకపోవడంతే ఐదేళ్లపాటు విద్యార్థులు నానాపాట్లు పడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి నిదులు మంజూరు చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏ హాస్టల్‌కు ఎన్ని నిధులు..

చోడవరంలో కళాశాల విద్యార్థుల వసతి గృహానికి రూ.30లక్షలు, కళాశాల విద్యార్థినుల వసతిగృహానికి రూ.30 లక్షలు, వడ్డాదిలో బాలుర వసతి గృహానికి రూ.18 లక్షలు, రావికమతంలో బాలికల హాస్టల్‌కి రూ.12.5 లక్షలు, అనకాపల్లిలో కళాశాల విద్యార్థుల వసతి గృహానికి రూ.37 లక్షలు, కశింకోటలో ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహానికి రూ.16 లక్షలు, వి.మాడుగుల నియోజకవర్గం ఎ.కోడూరులో ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌కి రూ.16.2 లక్షలు, కె.కోటపాడులో కళాశాల విద్యార్థినుల వసతిగృహానికి రూ.5.1 లక్షలు మంజూరు చేశారు. పరవాడ, సబ్బవరంలో బాలికల వసతి గృహాలకు రూ.15 లక్ష చొప్పున రూ.30 లక్షలు మంజూరయ్యాయి. నర్సీపట్నం ఆనంద నిలయం వసతి గృహానికి రూ.13 లక్షలు, బాలుర వసతిగృహానికి రూ.20 లక్షలు, బాలికల వసతి గృహానికి రూ.12 లక్షలు, కళాశాల విద్యార్థినుల వసతి గృహానికి రూ.3 లక్షలు, వేములపూడిలో బాలురు

... మిగతా 8వ పేజీలో

మంచాల మోడల్ స్కూల్‌కి జాతీయస్థాయి గుర్తింపు

- పాఠశాలలో ఉత్తమ విధానాలపై డాక్యుమెంటరీ
- జనవరి 8 నుంచి ఢిల్లీలో జరిగే సదస్సుకు ఎంపిక



మంచాల మోడల్ స్కూల్

చీడికాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై మంచాల మోడల్ స్కూల్‌లో తీసిన వీడియో డాక్యుమెంటరీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషన్


వెంకట లక్ష్మి, ప్రిన్సిపాల్

ప్లానింగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు న్యూఢిల్లీలో జాతీయ విద్యా సదస్సు జరగనున్నది. ఈ సందర్భంగా ప్రదర్శించే డాక్యుమెంటరీల్లో ఏపీ నుంచి మంచాల మోడల్ స్కూల్ రూపొందించిన డాక్యుమెంటరీ ఎంపికైందని ప్రిన్సిపాల్ చెరకావు వెంకట లక్ష్మి సోమవారం వెల్లడించారు. పాఠశాలలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై తాము రూపొందించిన డాక్యుమెంటరీ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక కావడం ఆనందంగా వుందని ఆమె అన్నారు.

కలెక్టరేట్ వద్ద

గతంలో కాలిపోయిన పూరింటికి పరిహారం ఇవ్వలేదని మనస్తాపం

ఒకరి ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలించిన కలెక్టరేట్ సిబ్బంది
- చికిత్స చేయడంతో తప్పిన ప్రాణాపాయం
- రూ.8 వేలు సాయం చెక్కు అందించిన ఆర్డీవో


అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణకు రూ.8 వేల చెక్కును అందజేస్తున్న ఆర్డీవో షేక్ ఆయిషా

అనకాపల్లి కలెక్టరేట్/మాకవరపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తన పూరిల్లు కాలిపోయి ఏడాదిన్నర దాటినా ప్రభుత్వం నుంచి పరిహారం సొమ్ము అందలేదంటూ ఓ వ్యక్తి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కలెక్టరేట్ సిబ్బంది వెంటనే అతడిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన అనిమిరెడ్డి రమణ ప్రభుత్వం స్థలం సుమారు మూడు సెంట్లలో తాటి ఆకులతో ఇంటిని నిర్మించుకుని నివాసం ఉండేవాడు. గత ఏడాది మే నెలలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోయింది. అప్పటి తహసీల్దార్, డీటీ విచారణ చేసి ప్రభుత్వం నుంచి రూ.8 వేలు పరిహారంగా అందించాలని నాటి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు. పూరిల్లు కాలిపోయిన బాధితులకు నాటి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి పరిహారం ఇచ్చేది కాదు. ఈ కారణంగా రమణకు కూడా పరిహారం మంజూరుకాలేదు. కానీ ఈ విషయం రమణకు తెలియక పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీ ఇవ్వడానికి వచ్చాడు. కార్యాలయం బయట పురుగుల మందు తాగిన రమణ...లోపల సమావేశ మందిరంలో అర్జీ ఇవ్వడానికి వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కలెక్టరేట్ సిబ్బంది వెంటనే స్పందించి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదిలావుండగా అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా ఎన్టీఆర్ వైద్యాలయానికి వెళ్లి రమణను పరామర్శించారు. ఇల్లు కాలిపోయినందుకు పరిహారం కింద రూ.8 వేల చెక్కును అందజేశారు.

తూటిపాలలో నర్సీపట్నం ఆర్డీవో విచారణ

మాకవరపాలెం మండలం తూటిపాలకు చెందిన అనిమిరెడ్డి రమణ కలెక్టరేట్‌కు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. వెంటనే గ్రామానికి వెళ్లి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణను ఆదేశించారు. దీంతో ఆయన సోమవారం మధ్యాహ్నం తూటిపాల వెళ్లి అనిమిరెడ్డి రమణ గురించి గ్రామస్థులను విచారించారు. ఇతను మూడు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పూరిల్లు నిర్మించుకున్నాడు. ఏడాదిన్నర క్రితం ఈ ఇల్లు కాలిపోవడంతో ఆ స్థలంలో స్థానంలో రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. ఇతనికి 1.8 ఎకరాల భూమి ఉంది. గ్రామస్థులు చెప్పిన ఈ సమాచారాన్ని నివేదిక రూపొంలో పొందుపరిచి జిల్లా కలెక్టర్‌కు పంపినట్టు ఆర్డీఓవ రమణ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.


వీవీ రమణ
ఆర్డీవో, నర్సీపట్నం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల



- ఆరు జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు
- పురుషులు 12,948, మహిళలు: 8,607
- అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది ఓటర్లు
- 2019 కంటే 1,968 మంది అధికం

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా సోమవారం ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తుది జాబితా విడుదలచేశారు. ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా 8,607 మంది మహిళలు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది, విజయనగరం జిల్లాలో 4,937, శ్రీకాకుళం జిల్లాలో 4,829, అనకాపల్లి జిల్లాలో 2,802, పార్వతీపురం మన్యంలో 2,262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన

... మిగతా 8వ పేజీలో

తుది ఓటర్ల జాబితా

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం	3,275	1,554	4,929
విజయనగరం	3,100	1,837	4,937
పార్వతీపురం మన్యం	1,532	730	2,262
అల్లూరి సీతారామరాజు	891	557	1,448
విశాఖపట్నం	2,403	2,874	5,277
అనకాపల్లి	1,747	1,055	2,802
మొత్తం	12,948	8,607	21,555

టమాటా ధర పతనం

- 30 కిలోల క్రేట్ రూ.250
- నెల రోజుల్లో మూడు వంతుకు పడిపోయిన రేటు
- గిట్టుబాటు కాదంటున్న రైతులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి' అన్న చందంగా వుంది టమాటా రైతుల పరిస్థితి. స్థానికంగా టమాటా పంట లేని సమయంలో కిలో రూ.50 నుంచి రూ.100 వరకు పలికిన ధర, ఇప్పుడు తాము పండించిన పంట చేతికి వచ్చేసరికి కిలో రూ.10కి పడిపోతున్నదని సాగుదారులు వాపోతున్నారు. సోమవారం కృష్ణాదేవిపేట మార్కెట్‌లో సుమారు 30 కిలోలు వున్న క్రేట్ టమాటాలు రూ.250కి మించి ధర పలకలేదు.


కృష్ణాదేవిపేటలో అమ్మకానికి టమాటాలు తీసుకువచ్చిన రైతులు

గొలుగొండ, కొయ్యూరు మండలాలకు సరిహద్దులో వున్న కృష్ణాదేవిపేట (ఏఎల్‌పురం) ప్రధాన వ్యాపారం కేంద్రంగా వుంది. ఈ రెండు మండలాల్లోని ఏఎల్‌పురం, చోద్యం, గరంపేట, లింగంపేట, పాడి, రత్నంపేట, కినపర్తి, వలసంపేట, భీమవరం, పి.మాకవరం, కృష్ణాదేవిపేట, నాగాపురం తదితర గ్రామాల్లోని మెట్ట భూముల్లో సెమీ రబీ పంటగా రైతులు టమాటా, వంగ వంటి కూరగాయ పంటలను సాగు చేస్తుంటారు. సెప్టెంబరు/ అక్టోబరు నెల్లో టమాటా మొక్కలు నాటిన పొలాల్లో ప్రస్తుతం పంట దిగుబడి వస్తున్నది. రైతులు టమాటాలను కృష్ణాదేవిపేటకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. నర్సీపట్నం, తుని ప్రాంతాల నుంచి దళారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కొద్ది రోజుల నుంచి

... మిగతా 8వ పేజీలో

వైసీపీ నేతల బరితెగింపు

- బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడిలో టీడీపీ నాయకులపై కర్రలతో దాడి
- తెలుగు యువత మండల అధ్యక్షుడు, అతని సోదరుడికి తీవ్రగాయాలు
- అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలింపు

చోడవరం, బుచ్చెయ్యపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడిలో వైసీపీ నేతలు బరితెగించారు. సోమవారం సాయంత్రం టీడీపీ నాయకులపై కర్రలతో దాడికి తెగబడ్డారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు సేనాపతి మణికంఠ, అతని సోదరుడు శ్రీనివాసరావులపై వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, అతని కుమారులు, సోదరుడి కుమారులు దారి కాచి కర్రలతో దాడి చేశారు. దీంతో మణికంఠ, శ్రీనివాసరావులకు తీవ్రంగా గాయాలయ్యాయి. దిబ్బిడి గ్రామానికి చెందిన తెలుగు యువత మండల అధ్యక్షుడు సేనాపతి మణికంఠను, అదే గ్రామానికి చెందిన వైసీపీ


వైసీపీ నేతల దాడిలో గాయపడిన సేనాపతి మణికంఠ

... మిగతా 8వ పేజీలో

కారిడార్ భూముల్లో పనులు


ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో కొబ్బరి చెట్లను తొలగిస్తున్న యంత్రాలు


పనులు జరుగుతున్న ప్రదేశంలో పోలీస్ బందోబస్తు

రహదారుల నిర్మాణం కోసం కొబ్బరి చెట్లు తొలగింపు

- నిర్వాసితులు అడ్డుకోకుండా పోలీస్ బందోబస్తు
- సీపీఎం నేత అప్పలరాజు గృహ నిర్బంధం

నక్కపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో సోమవారం మౌలిక వసతుల పనులు ప్రారంభమయ్యాయి. రాజయ్యపేట గ్రామం సర్వే నంబరు 292లో వున్న 244 ఎకరాల్లో ఎంపిక చేసిన ప్రాంతంలో రహదారుల నిర్మాణం కోసం కొబ్బరి, ఇతర జాతుల చెట్లను యంత్రాలతో కూల్చివేస్తున్నారు. అయితే తమకు పూర్తి స్థాయిలో పరిహారం అందజేసి, న్యాయం చేసే వరకు కారిడార్ భూముల్లో పనులు చేపట్టవద్దని కొద్ది రోజుల నుంచి రైతులు, సీపీఎం నేతలు ఆందోళన చేస్తుండడంతో ముందుజాగ్రత్త చర్యగా నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట సీఐలు కుమారస్వామి, లొద్దు రామకృష్ణ, జి.అప్పన్న నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును గృహ నిర్బంధం చేశారు. ఇండస్ట్రియల్ కారిడార్‌లో చేపట్టిన పనులను నక్కపల్లి తహసీల్దార్ నరసింహమూర్తి, ఏపీఐఐసీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఇదిలావుండగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును పోలీసులు గృహనిర్బంధం చేయడాన్ని నిరసిస్తూ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ హైవే జంక్షన్ వద్ద ఆందోళన చేశారు. కారిడార్ భూముల్లో పనులు చేపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ, పక్కనే వున్న కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్‌డ్రగ్ పార్క్‌ను నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయడం దారుణమని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితుకు నష్టపరిహారం చెల్లించి, ప్యాకేజీని అమలు చేయాలని, బల్క్‌డగ్ పార్క్‌ను ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు.

గరుడ వాహనంపై గోవర్ధనుడు



నక్కపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఉభయదేవేరులతో కూడి న స్వామివారి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై, పల్లకీలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి మాడవీధుల్లో మంగళ వాద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

సీపీఎం నేత అప్పలరాజు గృహ నిర్బంధం



గృహ నిర్బంధంలో ఉన్న అప్పలరాజు

ఎస్.రాయవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును సోమవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్స్ పరిశ్రమల కోసం రైతుల భూముల్లో చేపట్టిన చెట్లు, తుప్పల తొలగింపు ప్రారంభ పనులను అడ్డుకుంటారని భావించిన పోలీసులు ఆయన్ని గృహ నిర్బంధం చేశారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో ఉన్న స్వగృహంలో తనను ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కడికీ నక్కపల్లి, ఎస్.రాయవరం పోలీసులు వెళ్లకుండా నిర్బంధించారని అప్పలరాజు తెలిపారు.

ప్రజా పరిష్కార వేదికకు అర్జీలు నిల్: ఎంపీడీవో

మునగపాక, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని స్థానిక ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నెల పింఛన్‌ను ఈనెల 31వ తేదీన పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా సుమారు 8,397 మంది లబ్ధిదారులకు రూ.3.45కోట్లు నగదు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

'వరి రైతులను ఆదుకోవాలి'

మునగపాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంటకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా రైతులకు అపార నష్టం జరిగిందని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేసి, క్వింటాకు రూ.500 అదనంగా ఇవ్వాలన్నారు. రైతు భరోసాగా రూ.20వేలు జమ చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి.రంగారావు, ఎస్.బ్రహ్మాజీ, రామ సదాశివరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ సమావేశం

ఎలమంచిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరవుతారని తెలిపారు. మునిసిపాలిటీలో అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుందన్నారు.

'హక్కులపై అవగాహన అవసరం'

ఎస్.రాయవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తహసీల్దార్ జె రమేష్‌బాబు తెలిపారు. సోమవారం చినగుమ్ములూరులో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఉన్న 56 మందికి చెందిన డి పట్టాలను ఆన్‌లైన్ చేయాలని, దళిత కాలనీకి నూతన రోడ్డు, డ్రైనేజీ కావాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో టోర్నీలో దుర్గాభవానీకి కాంస్య పతకం



పాయకరావుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన యండమూరి దుర్గాభవానీ కాంస్య పతకం సాధించింది. సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్ఎం భవానీ మాట్లాడుతూ.. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూడో టోర్నీలో సబ్ జూనియర్స్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థిని యండమూరి దుర్గాభవానీ అద్భుత ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించిందన్నారు. విద్యార్థినిని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

▸▸ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



కొత్తూరు హైస్కూల్‌లో టీచర్లను కలిసిన రఘువర్మ

రాంబిల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, వారికి వెన్నుదన్నుగా ఉంటానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించారు. కొత్తూరు జడ్పీ హైస్కూల్‌లో పలువురు ఉపాధ్యాయులను కలిశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు, మాజీ అధ్యక్షుడు ఎన్‌వీ.సూర్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మండలంలోని పూడిమడక, అచ్యుతాపురం, హరిపాలెం, పెదపాడు, ఖాజీపాలెం, కొండకర్ల పాఠశాలలతో పాటు కేజీబీవీ పాఠశాలల్లో పర్యటించారు. గత ఆరేళ్ల నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను కృషిచేశానని, మరోసారి అవకాశం ఇవ్వాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, నేతలు తమ్మిరాజు, వెంకట సూర్యనారాయణ, కేవీ రమణ, మోటూరు త్రినాథస్వామి, ధనుంజయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లతో శాస్త్రీయ దృక్పథం : ఎంపీపీ



ఎలమంచిలి:కొత్తపేట హైస్కూల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్



నక్కపల్లి: చినదొడ్డిగల్లులో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎలమంచిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ఫెయిర్‌లతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్త పేట జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి విజ్ఞాన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి, వారిని అభినందించారు. మండల విద్యాశాఖ అధికారులు మీనాక్షి, అరుణ్‌కుమార్, కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు తదితరులు ప్రాజెక్టులను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల నుంచి మూడు విభాగాల్లో 33 ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థుల గ్రూపు విభాగం నుంచి ఆటోమేటిక్ స్పీడ్ కంట్రోల్ ప్రాజెక్టు(ఏటికొప్పాక), హైడ్రో ఎలక్ట్రిసిటీ(ఎలమంచిలి బాలికోన్నత పాఠశాల), విద్యార్థి వ్యక్తిగత విభాగం నుంచి రైజింగ్ బ్రిడ్జి(కొత్తపేట), ట్రాఫిక్ సేఫ్టీరూల్స్(జంపపాలెం), ఉపాధ్యాయ విభాగంలో న్యూరాన్ పనితీరు పురుషోత్తపురం ఉన్నత పాఠశాల ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు ప్రారంభించారు. మండలంలోని 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 20 సైన్స్ ప్రాజెక్ట్‌లను రూపొందించి ప్రదర్శించారు. దేవవరం, చినదొడ్డిగల్లు హైస్కూళ్ల విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్‌లు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్టు ఎంఈవోలు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు, హెచ్ఎం నారాయణరావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, తోట సత్తిబాబు, పాలూరి రమాదేవి, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకులు యేడిద వెంకట రమణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

ప్రతి విద్యార్థి భవిష్యత్తులో శాస్త్రవేత్తగా తయారు కావాలని మండల విద్యాశాఖాధికారులు రామారావు, జోషి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్సు ఫెయిర్‌లో కేజీబీవీ పాఠశాల, పాములవాక, జల్లూరు, కె.వెంకటాపురం, కోటవురట్ల హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు జానకిశ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు ప్రాజెక్టులను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌కుమార్, వంగలపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని ఎస్.నర్సాపురం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ-2 జి. రమేశ్‌బాబు ప్రారంభించారు. నోడల్ ఆఫీసర్లుగా హెచ్ఎంలు కోడి శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో వ్యక్తిగత విభాగంలో పాయకరావుపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎం. జ్యోతి వెంకటమహాలక్ష్మి, గ్రూప్ విభాగంలో పాయకరావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎస్.గగన్‌కుమార్, జి. శ్రీతేజ, ప్రదర్శించిన రోడ్ సేఫ్టీ, ఘాట్ రోడ్డుల ప్రదర్శనలు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. అలాగే ఉపాధ్యాయుల విభాగంలో రాజానగరం హైస్కూల్ ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ ఖాదర్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎంలు డీఎస్ భవాని, కేవీఎస్ఎల్ ప్రసాద్, వై. అప్పారావు, జి.గోవిందరావు, ఎన్‌జీవీ.లక్ష్మి పాల్గొన్నారు.



కోటవురట్ల ప్రభుత్వహైస్కూల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

అంబేడ్కర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం ఆందోళన



అచ్యుతాపురంలో ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

అచ్యుతాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై సీపీఎం నాయకులు సోమవారం అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కన్వీనర్ రొంగలి రాము మాట్లాడుతూ బీజేపీ నాయకులకు రాజ్యాంగంపై కనీస గౌరవం లేదన్నారు. కార్యక్రమంలో కూండ్రపు సోమునాయుడు, తట్టా రాజు, పోలవరపు గోవింద్, శేషు, సత్తిబాబు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తీరును నిరసిస్తూ సోమవారం సీఐటీయూ నేతలు నిరసన వ్యక్తం చేశారు. దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, కూర్మారావు, జానకి, అప్పన్న, రాము, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని కొరుప్రోలు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తొలుత సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, పెంటయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పలు రిజర్వేషన్‌లు రద్దు చేసి, దేశ ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.

కొత్త సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి

▸▸ ఎలమంచిలి సీఐ ధనుంజయరావు



ఎలమంచిలి: విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు

ఎలమంచిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ ధనుంజయరావు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐలతో కలిసి సీఐ విలేకర్లతో మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. సర్కిల్ పరిధిలోని హైవేపై, ప్రధాన జంక్షన్‌లు, కూడళ్లలో పోలీసు నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం త్రాగి వాహనాలు నడిపినా, అమితవేగం వికృత చేష్టలు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. డ్రంకెన్ డ్రైవ్ చేసే వారిపై మరింత నిఘా పెట్టామన్నారు. సమావేశంలో ఎస్ఐలు సావిత్రి, ప్రసాద్, ఉపేంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారంతా విధిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని రాంబిల్లి సీఐ నరసింగరావు అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా, జూదాలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. యువత మద్యం తాగి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దన్నారు. అమితవేగంతో వాహనాలు నడపవద్దని ఆయన హెచ్చరించారు.

మునగపాకలో..

నూతన సంవత్సర వేడుకల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ వేడుకల్లో డీజేలు ఏర్పాటు చేయకూడదన్నారు. అశ్లీల నృత్యాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. మద్యం సేవించి రోడ్లపై చిందులు వేసినా, అల్లరి చేసినా చర్యలు తప్పవన్నారు. ఆత్మీయతను మంచి వాతావరణంలో చాటుకోవాలని, 2024కు వీడ్కోలు, 2025కు స్వాగతం సంప్రదాయంగా ఉండాలన్నారు.

కోటవురట్లలో..

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, బైక్ రైడింగ్స్ చేయవద్దని కోటవురట్ల ఎస్ఐ రమేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అశ్లీల డ్యాన్సుల ప్రదర్శన ఏర్పాటు చేయవద్దన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని, అందరూ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకోవాలని సూచించారు.

వైసీపీ పాలనలో రెవెన్యూ రికార్డులు తారుమారు

▸▸ దర్యాప్తు నిర్వహించి దోషులుపై చర్యలు తీసుకోవాలి.. ▸▸ తోటాడ సదస్సులో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీను



మునగపాక: తోటాడ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న శ్రీను



పాయకరావుపేట రూరల్: మంగవరం సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

మునగపాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ రికార్డులు తారుమారయ్యాయని, వాటిపై సమగ్రంగా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఎందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీను అన్నారు. మండలంలో తోటాడలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రీ సర్వే పేరుతో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయన్నారు. పుస్తకాలు, రాళ్లపై జగన్ బొమ్మలు వేసుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలుతోపాటు అన్ని రకాల భూ సమస్యలు పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో మూలపేట పంచాయతీ శివారు గంగాదేవిపేటలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఉప సర్పంచ్ మొల్లేటి దేవిచంద్ర పలు సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

పాయకరావుపేట రూరల్‌లో..

గ్రామాలలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని మంగవరంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ సదస్సులో వివిధ భ సమస్యలకు సంబంధించి 3 దరఖాస్తులను స్వీకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, వైసీపీ నాయకులు వంగలపూడి రామారావు, కోనే శివ, టీడీపీ నాయకులు కోనే కొండబాబు, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

భూసమస్యల తక్షణ పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జీవీ జనార్దన్ అన్నారు. సోమవారం హరిపాలెంలో జరిగి సదస్సులో రైతుల నుంచి అర్జీలను తీసుకున్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల సూర్యనారాయణ, వెంకటరమణ, మారిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

మండలంలో 12,829 మంది పింఛనుదారులు

పాయకరావుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : 2025 జనవరి నెలకు సామాజిక పింఛన్లను మంగళవారం చేపడుతున్నారు. వాస్తవానికి జనవరి 1వ తేదీన బుధవారం ప్రభుత్వ సెలవు దినం కానప్పటికీ అధికారులు, సిబ్బంది నూతన సంవత్సర వేడుకల్లో బిజీగా ఉండే అవకాశం ఉన్నందున ఒకరోజు ముందుగా మంగళవారం చేపడుతున్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో 12,829 మంది పింఛనుదారులకు మొత్తం రూ.5,27,41,500 పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు తెలిపారు. సచివాలయాల ఉద్యోగులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి గ్రామాల్లో ఇంటింటి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని, సాయంత్రానికి వంద శాతం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

కడియం పూల మొక్కలకు డిమాండ్



హైవే పక్కన పూల మొక్కలను విక్రయిస్తున్న దృశ్యం

నక్కపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడియంపూల మొక్కలను మగువలు ఇష్టపడుతున్నారు. కడియం నుంచి చిరు వ్యాపారులు మొక్కలను తెచ్చి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. పసుపు, తెలుపు, వైలెట్ కలర్స్ చామంతి మొక్కలు, మందార, గులాబీలు, పలు రకాల పుష్పజాతులను నక్కపల్లి హైవే పక్కన, వారపుసంతల్లో విక్రయిస్తున్నారు. రకాలను బట్టి ఒక్కో మొక్క ధర రూ. 50నుంచి రూ.100 వరకూ విక్రయిస్తున్నారు. ప్రతి శుక్రవారం నక్కపల్లి వారపుసంతకు వి. వీరబాబు అనే వ్యాపారి కడియం నుంచి మొక్కలను వ్యాన్‌లో తెచ్చి విక్రయిస్తున్నాడు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

▸▸ ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు



సబ్ స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలతో పాటు కర్మాగారాలకు ఎటువంటి అవాంతరాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ని అందించడానికి చర్యలు చేపట్టామని స్థానిక ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతు పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విద్యుత్ లైన్ల కింద ఏపుగా పెరిగిన చెట్లు తొలగించామన్నారు. అలాగే అన్ని ప్రాంతాలకు విద్యుత్‌ని సరఫరా చేసే సబ్ స్టేషన్లో కూడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా మరమ్మతులు చేపట్టామన్నారు. తాత్కాలికంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

కొండకర్ల జంక్షన్ వద్ద లారీ బోల్తా

అచ్యుతాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో కొండకర్ల జంక్షన్ వద్ద భారీ రాళ్ల లోడుతో వస్తున్న లారీ సోమవారం సాయంత్రం బోల్తా పడింది. డ్రైవర్ దూకేసి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. అనకాపల్లి నుంచి పెద్దపెద్ద బండరాళ్లతో ఈ లారీ రాంబిల్లి మండలంలో నేవల్ నిర్మాణ పనులకు రవాణా చేస్తున్నారు. కొండకర్ల జంక్షన్ వచ్చేసరికి లారీ అదుపు తప్పి కాలువ వద్ద పడిపోవడంతో బండరాళ్లన్నీ పొలాల్లో పడిపోయాయి. అదే రోడ్డు మీద పడితే చాలా ప్రమాదం జరిగేది.

విద్యార్థులకు డీసీఈబీ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

ఎస్.రాయవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు సోమవారం డీసీఈబీ స్టడీ మెటీరియల్‌ను జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు ఎన్. సీతారామరాజు, డాక్టర్ అనిల్‌వర్మ, వీఆర్‌కే రాజు, స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మవరం హైస్కూల్‌లో నాటిన కొబ్బరి చెట్లు



హైస్కూల్‌లో కొబ్బరి మొక్కలు నాటుతున్న దృశ్యం

ఎస్.రాయవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం పాఠశాల హెచ్ఎం డి.రమేష్ సోమవారం వంద కొబ్బరి మొక్కలను ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావుకు వితరణగా అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలను స్థానిక ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్, విద్యా కమిటీ చైర్మన్ నాగిరెడ్డి ఆదినారాయణ నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత బి. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆర్.అప్పలనాయుడు, దీపిక, గారా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా 96 గోకులం షెడ్ల నిర్మాణాలు

ఎస్.రాయవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో మండలంలో 96 గోకులం పశువుల షెడ్ల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. సోమవారం జేవీ పాలెంలో నూతనంగా నిర్మించిన గోకులం పశువుల షెడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ షెడ్ల నిర్మాణానికి రూ.రెండు కోట్లు మంజూరయ్యాయన్నారు. జనవరి పదో తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో హద్దు మీరొద్దు

▸ ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోండి
▸ అనకాపల్లి, సబ్బవరం సీఐలు విజయ్‌కుమార్, రమణ


సీఐలు విజయ్‌కుమార్, రమణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన వాతావరణంలో అనకాపల్లి పట్టణవాసులు నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో రాత్రి వేళల్లో ఎక్కడ పడితే అక్కడ వాహనాలపై ఇష్టాను సారంగా తిరిగి ప్రశాంత వాతావరణాన్ని పాడు చేయవద్దన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఎక్కడా గొడవలకు దిగరాదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కూడలిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

సబ్బవరం :నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిసెంబరు 31, జనవరి ఒకటో తేదీన నిబంధనలను కఠినతరం చేసినట్టు సబ్బవరం సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మంగళవారం రాత్రి ట్రిపుల్ రైడింగ్, అతివేగం, అతి సౌండ్‌తో ద్విచక్రవాహనాలు నిడిపితే కేసుల నమోదు తప్పదన్నారు. రాత్రి పది గంటల తరువాత ఎవరైనా రోడ్డుపై ఇష్టానుసారం బైక్‌లపై తిరిగినా, లౌడ్ స్పీకర్లు వినియోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసినా చర్యలు తప్పవన్నారు. ఇళ్ల వద్ద అంతా ఆనందంగా ఈ వేడుకలను జరుపుకోవాలని సూచించారు. అనవసరంగా కేసుల్లో ఇరుక్కొని యువత భవిష్యత్తును పాడుచేసుకోవద్దని ఆయన హితవు పలికారు. అలాగే, గుల్లాటలు, పేకాటలు, కోడిపందాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల ధర్నా


కోర్టు భవనాల ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో సీనియర్ న్యాయవాది టీవీ శేషాద్రిపై దౌర్జన్యంగా వ్యవహరించి, చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో స్థానిక కోర్టు భవనాల ఎదుట సోమవారం న్యాయవాదులు ధర్నా నిర్వహించి, విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి దుర్గారావు, సీనియర్ న్యాయవాదులు కె.చంద్రశేఖర్, నాయుడు, శ్రీనివాసరావు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పీటీడీ డిపో ఎదుట కార్మికుల ఆందోళన


సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పీటీడీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో యూనియన్ డిపో కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో వారంతా సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను రద్దు చేసి తిరిగి అదే డిపోలో పోస్టింగ్‌లు ఇవ్వాలని, రూట్ సర్వేలు జరిపి రన్నింగ్ టైమ్స్ సరిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ఎం.రావు, కె.రాజు, కె.ఎస్. రావు, జీఎస్ఎల్ ఈశ్వరి, కె.ఆర్.కళ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

పరవాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టీల్‌ప్లాంట్ లయన్స్ క్లబ్ స్టడీ మెటీరియల్‌ను సమకూర్చింది. సోమవారం క్లబ్ అధ్యక్షురాలు పీకేఎం లక్ష్మి చేతుల మీదుగా వీటిని అందజేశారు. విద్యార్థులంతా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి బి.సత్యప్రకాశ్, ట్రెజరర్ ఆర్.రామచంద్రరావు, పాఠశాల హెచ్ఎం ఆర్.సుజాత, ఎం.జగన్నాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణ మండపం ఆదాయం పై విచారణకు వినతి

పరవాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వెన్నెలపాలెంలో గల ఏసీ కల్యాణ మండపానికి అద్దెల ద్వారా వస్తున్న ఆదాయంపై విచారణ జరిపించాలని గ్రామానికి చెందిన గొంప మారునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పంచాయతీ ఆధీనంలో మండపం నిర్వహణ కొనసాగుతోందని, అద్దె ద్వారా వచ్చిన ఆదాయంలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు.

అర్జీలపై మూడు రోజుల్లో చర్యలు

▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం ▸ సిబ్బందితో రోజువారీ సమీక్షలు జరుపుకోవాలని సూచన


కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ జాహ్నవితో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరించి తద్వారా ఈ కార్యక్రమంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలపై మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని, అధికారులు వారి శాఖలకు సంబంధించి అందిన అర్జీలపై సిబ్బందితో రోజు వారీ సమీక్ష నిర్వహించుకోవాలని సూచించారు. ఇదిలావుంటే ఉదయం నుంచి జరిగిన ఈ కార్యక్రమంలో ముగిసే సరికి 206 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, డీపీవో శిరీషారాణిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీదారుతో మాట్లాడుతున్న ఏఎస్పీ దేవప్రసాద్

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఏఎస్పీ దేవప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందే అర్జీల విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమం ముగిసే సరికి 33 అర్జీలు అందగా, వాటిలో భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు తదితరాలకు సంబంధించి ఎక్కువగా ఉన్నాయని పోలీస్ విభాగాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను సహించం : ఎమ్మెల్యే పంచకర్ల


పరవాడలో ఎమ్మెల్యే రమేష్‌బాబుకు అర్జీని అందిస్తున్న నాయకులు

పరవాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హెచ్చరించారు. పరవాడలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు. ఇటువంటి భూములను కబ్జాకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు భూ సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు పలువురు అర్జీలను అందేశారు. తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుల్లేపల్లి, మొగలిపురం గ్రామాల్లో...

సబ్బవరం : భూ సమస్యలు శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని గుల్లేపల్లి, మొగలిపురం గ్రామాల్లో సోమవారం జరిగిన సదస్సుల్లో మాట్లాడారు. భూ సమస్యలపై రైతులెవరూ ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన అసరం లేదన్నారు. అర్జీ అందిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ ఎంపీపీ గండి దేముడు, సర్పంచ్‌లు గండి అరుణ, బండారు మంగ, బోను దేముడమ్మ, ఎంపీటీసీలు గొర్లి కనకరాజు, తమరాన సన్యాసమ్మ, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను, బంగారునాయుడు, నానాజీ, డీటీ గణపతిరావు, సర్వేయర్లు ఎల్అప్పారావు, లోకేశ్, రాంబాబు, వీఆర్వో శేఖరరావు పాల్గొన్నారు.


సబ్బవరం మండలం గుల్లేపల్లిలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సమష్టి కృషితో పాఠశాలలు అభివృద్ధి

▸ రాష్ట్ర స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పర్యవేక్షకులు ఇస్మాయిల్

కశింకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ పర్యవేక్షకులు, దీక్షా యాప్ కో-ఆర్డినేటర్ టి.ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీల శిక్షణ తరగతులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఒక రూపాయికి బొమ్మ బొరుసు వంటి వారన్నారు. వీరు సమష్టి కృషితో విద్యాబోధనను మెరుగుపర్చుకోవడంతో పాటు, పాఠశాలలను అభివృద్ధి చేసుకోవచ్చునని వివరించారు. అనంతరం దీక్షా యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలి, అప్‌లోడ్ ఎలా చేసుకోవాలి తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో బి.శకుంతల, స్టేట్ రిసోర్స్ పర్సన్ సిహెచ్.ఎస్.దొర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎంసీ పర్యవేక్షకులు ఇస్మాయిల్

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ


నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలకు అంతా దూరంగా ఉండాలంటూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ, ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండకుంటే భవిష్యత్తు అంధకారమే అన్నారు. నూతన సంవత్సర వేడుకలను అంతా ఇంటివద్దే కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుకోవాలన్నారు. అంతకు ముందు వీరంతా సీఐటీయూ కార్యాలయం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.గౌతమ్, ఎం.వినయ్, నూకరాజు, విజయ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దొండగెడ్డ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


కబ్జాగురైన స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొత్తూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు దేవీనగర్ వద్ద దొంగ గెడ్డ కాలువ గట్టును కబ్జా చేసిన అంశం పంచాయతీ కార్యదర్శి సుభాష్ తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సోమవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సాయి, రేబాక వీఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

కశింకోట, డిసెంబరు 30 : మండలంలోని కన్నూరుపాలెం, నర్సింగబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులను సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాల్లో వీటిని కూటమి నాయకులు అందజేశారు.

వాడ చీపురుపల్లి టీచర్‌కు సత్కారం


వరలక్ష్మిని సత్కరిస్తున్న అతిథులు

పరవాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో వాడచీపురుపల్లి హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయిని ఎస్ఎస్ఎస్ వరలక్ష్మిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. 'పర్యావరణం' అంశంపై ఆమె వినిపించిన కవితా పఠనంతో పాటు తాను రూపొందించిన 'ముక్త పదగ్రస్థం' అనే నూతన కవితా ప్రక్రియను పరిచయం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను సోమవారం పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన


సబ్బవరం హైస్కూల్‌లో ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంఈవోలు


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పరవాడ మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు

సబ్బవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గణితం, పర్యావరణం, సాంకేతిక రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను వివిధ పాఠశాలల విద్యార్థులు స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ బోకం సూర్యకుమారి తొలుత ప్రదర్శనను ప్రారంభించారు. స్టాల్స్‌ను పరిశీలించిన ఆమెకు విద్యార్థులు వాటి ప్రాముఖ్యతను చక్కగా వివరించారు. చెత్త నుంచి సంపద తయారీ వ్యవస్థ, మనిషి ఆరోగ్యం, పర్యావరణ ప్రభావం, ఎయిర్ పొల్యూషన్ ప్రభావం, సోలార్ హౌస్ నమూనా, పోరస్ పేవ్‌మెంట్ వ్యవస్థ, గ్రీన్ హౌస్ గ్యాసెస్, హ్యూమన్ నెర్వస్ సిస్టమ్ పని చేసే విధానం, ఎలక్ట్రిక్ విద్యుత్‌పై అయస్కాంత ప్రభావం, వాటర్ సైక్లింగ్, మైక్రోస్కోప్స్ తదితరాలపై విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తరచూ ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లోని మేధాశక్తిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎల్. లక్ష్మణరావు, ఎం.జె. రవీంద్రబాబు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పి.రాధా కుమారిలతో పాటు తొమ్మిది పాఠశాలల సైన్స్ ఉపాధ్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: మండల కేంద్రం పరవాడ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఎంఈవోలు ఎం.దివాకరరావు, జి.సాయిశైలజా ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. మండల పరిధిలో గల 12 ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు చెందిన విద్యార్థులు చక్కని ప్రదర్శనలు ఏర్పాటు చేరుశారు. వారు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు అదరహో అనిపించాయి. వీటిలో ఉత్తమ ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈవోలు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి మూడో తేదీన జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు పెద్దినాయుడు, కనకారావులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

'షెడ్యూల్ కులాల వర్గీకరణ గడువు పెంచాలి'

తుమ్మపాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ కులాల వర్గీకరణ గడువును పెంచాలని రెల్లి సంఘం జాతీయ అధ్యక్షుడు భూపతి అప్పారావు కోరారు. సోమవారం తుమ్మపాలలో రెల్లి సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఇంకా పూర్తి కాలేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నివాసముంటున్న షెడ్యూల్ కులాల వారికి అవగాహన లేక చాలా మంది తమ పేర్లను నమోదు చేసుకోలేదన్నారు. అధికార యంత్రాంగం సైతం అవగాహన కార్యక్రమాలు చేపట్టకుండా తూ.తూ. మంత్రంగా వర్గీకరణ ప్రక్రియను కొనసాగిస్తున్నారన్నారు. ఈ అంశానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోన అప్పారావు, కోన దుర్గేశ్వరరావు, బంగారి వెంకటేశ్వరరావు, ముత్యాల నూకరాజు, భూపతి ఈశ్వర అప్పారావు, కోన జై చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని వామపక్షాలు ధర్నా

▸ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం


నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు సోమవారం నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ రాజ్యసభలో అంబేడ్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అమిత్ షాకు రాజ్యాంగం మీద, అంబేడ్కర్ మీద గౌరవం లేదని అందుకే ఆయన పట్ల అగౌరవంగా మాట్లాడారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్. శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


పరవాడలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

పరవాడలో...

పరవాడ : అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సినిమాహాల్ జంక్షన్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అమిత్ షాకు రాజ్యాంగం మీద, అంబేడ్కర్ మీద గౌరవం లేదన్నారు. తక్షణమే అతన్ని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. అనంతరం ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, రమణ, మంగరాజు, అప్పలనాయుడు, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా నూతన సంవత్సర వేడుకలు

- శాలువాలు, బొకేలు వద్దు..
- పుస్తకాలు, పెన్నులతోనే శుభాకాంక్షలు
- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



పాడేరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను వినూత్నంగా సమాజానికి ఉపయోగపడేలా నిర్వహించుకుందామని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను శాలువాలు, పూల బొకేలతో కాకుండా పుస్తకాలు, పెన్నులతో నిర్వహించుకుందని పిలుపునిచ్చారు. వాటిని విద్యార్థులకు అందించవచ్చునన్నారు. వినూత్నమైన ఈ చర్యతో సమాజానికి మంచి సందేశం వెళుతుందన్నారు. తన ఆలోచనలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సహకరించాలని జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ కోరారు.

ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం కిటకిట



ఉమానీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన శైవ క్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు భక్తులతో కిటకిటలాడింది. పాడేరు పరిసర ప్రాంతాల ప్రజలు సోమవారం అధిక సంఖ్యలో హాజరై దేవతా మూర్తులను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఆలయ ప్రసాద కమిటీ ప్రతినిధులు, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఇద్దరు డిగ్రీ విద్యార్థుల ఎంపిక



పి. రమేశ్



వి. మహేశ్

చింతపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ గురుకసి విశ్వవిద్యాలయంలో జనవరిలో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీపీ చదువుతున్న పి. రమేశ్, వి. మహేశ్ ఆంధ్ర విశ్వవిద్యాలయం సౌత్‌జోన్ స్థాయి రెజ్లింగ్ క్రీడల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. తాజాగా జనవరి 3 నుంచి 7 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన కోచ్ నూకరాజు, పీడీ శివరామ్ కుమార్‌ని అభినందిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

సీలేరులో విస్తృతంగా వాహన తనిఖీలు



సీలేరులో వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీలేరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీలేరులో సోమవారం తెల్లవారుజాము నుంచి స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలను నిర్వహించారు. కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి తెలంగాణా, ఇతర రాష్ట్రాలకు స్మగ్లర్లు గంజాయి రవాణా చేస్తారన్న నిఘా వర్గాల హెచ్చరికలతో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రతీ వాహనాలన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

పిట్టగెడ్డలో బోర్ నిర్మాణ పనులు ప్రారంభం

ముంచంగిపుట్టు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో కుమడ పంచాయతీ పిట్టగెడ్డ గ్రామంలో తాగునీటి బోరింగ్ పనులకు సర్పంచ్ మఠం ముక్తమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ నిధులు వెచ్చించి నీటి పథకాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పిట్టగెడ్డ గ్రామంలో పంచాయతీ నిధులు రూ.1.6 లక్షలతో బోర్ పనులను చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కిముడు రాములమ్మ, వైసీపీ నాయకులు టి.భాస్కర రావు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలయ్యాం.. ఆదుకోండి

- ముగ్గురు చిన్నారుల వేడుకోలు
- మృతి చెందిన తల్లిదండ్రులు



తల్లిదండ్రులు మృతితో అనాథలైన చిన్నారులు

కొయ్యూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చదువుకునే సమయంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలయ్యారు. మండలంలోని మంప గ్రామానికి చెందిన సెగ్గే మల్లేష్, రత్నం దంపతులకు శివగంగ (14), దేవి దుర్గ(12), విష్ణు మూర్తి(10) అనే ముగ్గురు సంతానం. మల్లేష్, రత్నం వ్యవసాయ కూలీలుగా పనులు చేస్తూ జీవనం సాగించేవారు. 2018లో రత్నం అనారోగ్యం బారిన పడి మరణించింది. దీంతో ముగ్గురు చిన్నారులను తండ్రి మల్లేష్ (38) చదివించుకుంటూ జీవనం సాగించేవాడు. వారం రోజుల క్రితం గ్రామం లోనే కూలీ పనులకు వెళ్లి పని చేస్తుండగా అపస్మారక స్థితికి వెళ్లాడు. దీంతో స్థానికులు అతడిని రాజేంద్రపాలెం పీహెచ్‌సీకు తరలించగా.. అచ్చట వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆ ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. వారిని పండు ముదుసలి అయిన అమ్మమ్మ అక్కమ్మ చేర తీసింది. ఆమె కూడా ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ చిన్నారులు ఆమెకు భారమయ్యారు. ఈ చిన్నారులను ఆదుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రకృతి గీసిన చిత్రం



మండల పరిధిలోని సుజనకోట పంచాయతీ కేంద్రం సమీపంలోని మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో సోమవారం ఉదయం సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. మెలికలు తిరిగి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయ లు, దానిని ఆనుకుని ఉన్న ఎత్తైన పచ్చని గిరులపై సూర్యోదయం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

- ముంచంగిపుట్టు/ఆంధ్రజ్యోతి

పంట బీమా నమోదులో మీ-సేవ నిర్వాహకుల దోపిడీ

- రైతుల నుంచి అధికంగా వసూళ్లు
- ప్రీమియం రూ.300.. మీ-సేవకు రూ.600 వసూలు
- పట్టించుకోని అధికారులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంట బీమా నమోదులో మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు అధిక నగదు వసూలు చేస్తున్నారు. అధిక వసూళ్లపై రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజ్‌మా పంట బీమా నమోదు ఈనెల 31వ తేదీతో ముగుస్తుంది. పంట బీమా నమోదు ప్రక్రియ మీ-సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసుకోవాలి. ఎకరం రాజ్‌మా పంటకు ప్రభుత్వానికి రూ.300 ప్రీమియంగా చెల్లించాలి. మీ-సేవ కేంద్రం నిర్వాహకులు సర్వీసు చార్జీగా రూ.50 తీసుకోవాలి. అయితే మీ సేవ నిర్వాహకులు గిరిజన రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఒక్కొక్క రైతు నుంచి ఎకరం పంటకు బీమా చేసేందుకు రూ.900 వసూలు చేస్తున్నారు. ప్రీమియం కంటే రూ.600 నగదు అధికంగా వసూలు చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రలోని ఓ మీ-సేవ కేంద్రం నిర్వాహకులు ఎకరం పంటకు బీమా చేసేందుకు రూ.900 తీసుకున్నాడని అగ్రహారం గ్రామానికి చెందిన గెమ్మెలి మత్స్యరాజు విలేకరులకు తెలియజేశాడు. పంట బీమా నమోదు మంగళవారంతో ముగుస్తుండడంతో మీ-సేవ నిర్వాహకులు అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికైన మీ-సేవ కేంద్రాల నిర్వాహకుల అధిక వసూళ్లను జిల్లా అధికారులు నియంత్రించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటితో ముగియనున్న రాజ్‌మా పంట బీమా గడువు

చింతపల్లి: రాజ్‌మా పంటకు బీమా చేయించుకునేందుకు ఈనెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని పెదబరడ పంచాయతీ బారికదొరపాకలు గ్రామంలో రాజ్‌మా పంట కోత ప్రయోగం నిర్వహించి దిగుబడిని నిర్ధారించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాజ్‌మా పంటకు బీమా చేయించుకునేందుకు గడువు ముగుస్తుండడంతో రైతులు మీసేవా కేంద్రాల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు.

అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ

పాడేరురూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, విద్యార్థినుల పట్ల బాధ్యత రహితంగా వ్యవహరించిన హెచ్‌ఎం, వార్డెన్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఆయన కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీన విద్యార్థిని పిన్ని పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం, వార్డెన్‌ల అనుమతితో బయటకు తీసుకువెళ్లి పాపకు కావాల్సిన వస్తువులను కొని తిరిగి పాఠశాలలో అప్పగించి వచ్చిందన్నారు. 27వ తేదీన విద్యార్థినికి యూనిఫాం ఇచ్చేందుకు తల్లిదండ్రులు వెళితే.. మీ పిల్లను మీరే తీసుకువెళ్లారు... మళ్లీ వచ్చి మమ్మలను అడుగుతారేంటి అని పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా మాట్లాడారన్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించి బాలిక విషయమై ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడిందన్నారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే విద్యాలయాల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యాన్ని సస్పెండ్ చేయాలని, ఘటనకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు కంబిడి లత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ జాతీయ రెజ్లింగ్ పోటీల్లో నాలుగు పతకాలు



పతకాలతో విద్యార్థులు

కొయ్యూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో తమ విద్యార్థులు నాలుగు పతకాలను సాధించారని స్థానిక రెజ్లింగ్ అకాడమి కోచ్ అంబటి నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం పాలెంలో 15 విభాగాల్లో సౌత్‌జోన్ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీలకు ఐటీడీఏ రెజ్లింగ్ అకాడమి తరపున కొయ్యూరుకు చెందిన నలుగురు 44, 46, 48, 60 కేజీల రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఇందులో రెండు రజిత, రెండు కాంస్య పతకాలను సాధించారన్నారు. జి. దుర్గాప్రసాద్ 48 కేజీల విభాగంలో ఫ్రీస్టయిల్ రజితం, వంతల శ్రీను 44కేజీల విభాగంలో కూజీస్ ఫ్రీస్టయిల్ కాంస్యం, బాలికల విభాగంలో 46 కేజీలో కె. సబిత రజితం, 12వ సీనియర్ విభాగంలో సీహెచ్ మహేష్ 60 కేజీల గ్రీకో రామన్ కాంస్య పతకాలను సాధించారని కోచ్ అంబటి నూకరాజు తెలిపారు.

అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలకు సీపీఎం నిరసన



పాడేరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పాడేరు రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం నాయకులు సోమవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ నాయకులు ఎల్.సుందరరావు, పాలికి లక్కు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్ షాను ప్రధాని మోదీ వెనకేసుకొని రావడం దారుణమన్నారు. అమిత్ షాను మోదీ మంత్రిమండలి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు కె.రాధాకృష్ణ, సీపీఎం, సీపీఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు చిన్నారావు, దాసు, రాజు, సూరిబాబు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో..



సుజనకోట సమీపంలో మత్స్యగెడ్డపై ఆవిష్కృతమైన సుందర దృశ్యం

ముంచంగిపుట్టు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ కోరారు. అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రిని పదవి నుంచి తొలగించాలని, డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, నారాయణ, రామదాసు, శంకరరావు పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

జి.మాడుగుల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అవమానించడం సరికాదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సోమవారం బీరం పంచాయతీ ప్రధాన రహదారిపై వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దీనబంధు, కోటేశ్వరరావు, శ్రీనుబాబు, సింహాచలం, మత్స్యలింగం తదితరులు పాల్గొన్నారు.

సేల్స్‌మన్‌పై మేనేజర్‌కు ఫిర్యాదు

డుంబ్రిగుడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్రుం పంచాయతీ సర్రాయి డీఆర్ డిపో సేల్స్‌మన్‌పై జీసీసీ అరకు బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావుకు జాంకరవలస గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సోమవారం గిరిజనులు బిస్వనాథ్, రఘు, గోవర్ధన్ మాట్లాడుతూ డిసెంబరు నెలకు సంబంధించి కోటా బియ్యం సంబంధిత సేల్స్‌మేన్ పంపిణీ చేయలేదని చెప్పారు. నెల వారీగా కోటా బియ్యంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్న గిరిజనులు, ఈ నెల కోటా బియ్యం పంపిణీ చేయకపోవడంతో బయట మార్కెట్‌లో అధిక ధర చెల్లించి కుటుంబాలను నెట్టుకు వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం పంపిణీ చేయాలని సేల్స్‌మేన్‌ను సంప్రదిస్తే సమాధానం ఇవ్వడం లేదని వాపోయారు. కోటా బియ్యం పంపిణీ చేసి తమ కష్టాలను తీర్చాలని వారు విన్నవించారు.

మార్కెటింగ్‌పై విద్యార్థినులకు అవగాహన

పెదబయలు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ విభాగంలో విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అటల్ టింకరింగ్ ల్యాబ్ ట్రైనర్లు కిరణ్, సూర్య తెలిపారు. బయ్యార్, ఎస్‌పవర్ వారి సౌజన్యంతో సోమవారం వారపు సంతలో మార్కెటింగ్ ప్రధానోపాధ్యాయుడు చెట్టి నారాయణ సమక్షంలో అవగాహన సదస్సు ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1 విద్యార్థినులు తయారు చేసిన వస్తువులను ప్రజలకు విక్రయించారు. దీనివల్ల ఏ వస్తువునైనా సులభంగా ఎలా విక్రయించాలో విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. మహిళలు వ్యాపార రంగంలో తమకున్న నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి సైన్స్ ఉపాధ్యాయురాలు మహేశ్వరి పాల్గొన్నారు.



మార్కెటింగ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గ్రామ స్థాయిలో వైద్యం అందాలన్నదే లక్ష్యం

- డీఎంహెచ్‌వో జమాల్ బాషా



రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో

డుంబ్రిగుడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో ఉన్నత వైద్యాన్ని గిరిజనులకు అందించాలన్న లక్ష్యంగా వైద్య, ఆరోగ్య శాఖను బలోపేతం చేస్తున్నామని డీఎంహెచ్‌వో జమాల్ బాషా చెప్పారు. మండలంలోని కొర్రా పంచాయతీ బొర్రాపాలెం గ్రామంలో సోమవారం 104 ద్వారా గిరిజనులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, హెల్త్ అసిస్టెంట్ లోవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఐటీఐను సందర్శించిన ఎమ్మెల్యే మత్స్యలింగం



కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అరకులోయ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ఐటీఐను ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని ఆరా తీశారు. శిక్షణ పొందిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారా? లేదా? అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. విద్యార్థులు చక్కగా శిక్షణ పొంది స్వయం ఉపాధి యూనిట్లు పొందాలన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై విద్యార్థులు ఏకరువు పెట్టారు. స్టాఫ్ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ తనిఖీల్లో వైసీపీ నాయకులు రామ్మూర్తి తదితరులు వెంట ఉన్నారు.

108 నిమిషాల్లో 108 సార్లు సూర్య నమస్కారాలు

- జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్

పాడేరురూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏసీఎస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8వ తేదీన 12 వేల మంది గిరిజన విద్యార్థులతో 108 నిమిషాల్లో 108 సార్లు సూర్య నమస్కారాలు ప్రక్రియ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ప్రణవ్ సంకల్ప యోగ సమితి వ్యవస్థాపకులు పతాంజలి శ్రీనివాస్ పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లో నిర్వహిస్తున్న యోగా శిక్షణ పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దశల వారీగా మిగిలిన మండలాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని, యోగా గురువు పతాంజలి శ్రీనివాస్, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 కేంద్రాల ద్వారా రాగుల కొనుగోలు

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌బీఎస్ నంద్



కొయ్యూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడేరు డివిజన్ పరిధిలో 25 కేంద్రాల ద్వారా రాగులు(చోళ్లు) కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌బీఎస్ నంద్ తెలిపారు. సోమవారం మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి ధాన్యం తేమ శాతం పరిశీలనతో పాటు చెల్లింపులపై రైతులను వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఏవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాగుల పంట కోతలు జరుగుతున్నాయన్నారు. ధాన్యం మాదిరిగా రాగులుకు మద్దతు ధర కల్పిస్తూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రాగుల సాగు ఎక్కువగా జరిగే పాడేరు డివిజన్ పరిధి కొయ్యూరు మినహా మిగిలిన మండలాల్లో 500 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా 25 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పనులు కల్పించాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు పనులు ప్రారంభించని గ్రామంలో వెంటనే కూలీలకు పని కల్పించాలన్నారు. ప్రతి కూలీ గరిష్ఠంగా రూ.300 కూలి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులందరికీ జాబ్ కార్డులు అందజేయాలన్నారు. వినియోగంలోలేని జాబ్ కార్డులను యాక్టివ్ చేయాలన్నారు. పనులు కల్పించలేదని ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వినియోగదారుల సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న వినియోగదారుల సమాఖ్య నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో వినియోగదారుల సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుదిడే చిట్టిబాబు, కిముడు రమేష్ సోమవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్.అభిషేక్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారుల ద్వారా వస్తుసేవల వినియోగంలో పెరుగుతున్న కల్తీ, నాణ్యతా ప్రమాణాల లోపం, అధిక ధరలకు విక్రయాల నివారణకు పాడేరులో వినియోగదారుల సమాచార కేంద్రం అవసరం ఉందన్నారు. ఈ కేంద్రం ద్వారా సేవలు, ఫిర్యాదులపై వినియోగదారులు నష్ట పరిహారం పొందేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతీ మండల తహసీల్దార్ అధ్యక్షతన తూనికలు, కొలతలు, నాణ్యత ప్రమాణాలపై వర్తక సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

క్షయ నిర్మూలనకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాధన



కొంతెలిలో క్షయ నిర్మూలనకు టీకాలు వేస్తున్న వైద్యులు

హుకుంపేట డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలనకు వ్యాక్సినేషన్ తప్పనిసరి అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాధన తెలిపారు. మండలంలోని హుకుంపేట వైద్య సిబ్బందితో కలిసి సోమవారం వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ రాకుండా ముందస్తు 18 ఏళ్ల పైబడి నిండిన యువకులు, వృద్ధులు టీకాలు చేయుంచుకుంటే తమకు వ్యాధి రాకుండా ఉంటుందని సూచించారు. క్షయ వ్యాధి నిర్మూలన చేయడానికి టీబీ పర్యవేక్షణ అధికారి కె.సదానందం, తహసీల్దార్ ఎం.ధనరాజు, ఏఎన్ఎం విజయలక్ష్మి, రత్నకుమారి, ఆశ కార్యకర్తలు హాజరయ్యారు.

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి

చింతపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ రాత్రి నూతన సంవత్సర వేడుకలను ప్రజలు గృహాల్లోనే వేడుకలు చేసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, రహదారులపై వేడుకలు జరుపుకోరాదన్నారు. హోటళ్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు నిర్వహించే వ్యక్తులు డీజే సౌండ్స్, అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లంబసింగి పర్యాటక ప్రాంతంపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

వైద్య శాఖలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలతాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారామెడికల్, సపోర్టింగ్ స్టాఫ్ విభాగంలో 29 క్యాటగిరీలలో 244 పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. అందులో కాంట్రాక్టు పోస్టులు 107, అవుట్ సోర్సింగ్ పోస్టులు 137 ఉన్నాయన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల పాడేరులో ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారిమన్నారు.. మరిన్ని వివరాలకు జీఎంసీ పాడేరు వెబ్‌సైట్‌లో చూడవచ్చునన్నారు.

చురుగ్గా ధాన్యం కొనుగోలు

మూడు రోజుల్లోనే 80 టన్నుల సేకరణ

- 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ
- ప్రక్రియ సులభతరం కావడంతో అన్నదాతల హర్షం

మాకవరపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోళ్లు చురుగ్గా సాగుతున్నాయి. ప్రక్రియ సులభతరం కావడంతో 80 టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించారు. ఇందుకు సంబంధించి నగదు ఖాతాల్లోనే 24 గంటల్లో జమైంది. దీంతో అన్నదాతలో హర్షం వ్యక్తమవుతోంది.

వైసీపీ ప్రభుత్వంలో ఇన్నన్ని షరతులు కాదయా!

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ధాన్యం కొనుగోళ్లు చేసేటప్పుడు రైతులు అగచాట్లు పడ్డారు. అనేక షరతులు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేశారు. ముందుగా రైతులు శాంపిల్ ధాన్యాన్ని తీసుకొని సచివాలయానికి వెళ్లి అక్కడ తేమను పరీక్షించాలి. తరువాత మూడు నుంచి వారం రోజులకు ఆర్డర్ ఇచ్చేవారు. అనంతరం మిల్లుకు తరలించాల్సి వచ్చేది. అలాగే ఏ మిల్లుకు తరలించాలనేది ప్రభుత్వమే నిర్ణయించేది. దీంతో ధాన్యం మిల్లుల వద్ద ఐదు నుంచి పది రోజుల పాటు ధాన్యం ఉండిపోయేవి. ఫలితంగా ధాన్యం బరువు తగ్గి రైతులకు తీవ్ర నష్టం వచ్చేది. ఫలితంగా చాలా మంది రైతులు ప్రవేటు వ్యక్తులకు అమ్మకాలు జరిపి తీవ్రంగా నష్టపోయారు.

కూటమి ప్రభుత్వంలో తప్పిన ఇక్కట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు ఇబ్బందులు తొలిగినట్లయింది. ప్రస్తుతం రైతులకు నచ్చినప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంది. ధాన్యం సచివాలయానికి తీసుకువెళ్తే అదే రోజు తేమశాతం చెక్ చేసి రైతు ఎప్పుడు ధాన్యం తరలిస్తారు, ఆ ధాన్యం ఏ మిల్లుకు తరలించాలనేది రైతు ఇష్టమ్మీదే ఆధారపడి ఉంటుంది. దీనికితోడు మిల్లుకు ధాన్యం తరలించిన 24 గంటల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమఅవుతుంది.

వైసీపీ ప్రభుత్వంలో రైతులు మిల్లుకు తరలించిన రెండు, మూడు నెలలకుగాని ధాన్యం డబ్బులు పడేవికావు. అలాగే గత ప్రభుత్వం ఆర్‌జెఎల్, 1061, 1064 వంటి సాధారణ రకాల వరికి వంద కిలోల బస్తాకు రూ.2183 ఇచ్చేది. కూటమి ప్రభుత్వంలో వంద కిలోల బస్తా రూ.2300 వస్తుంది. దీంతో రైతులు గిడుతూరు గ్రామంలో ఉన్న మిల్లుకు ఇప్పటికే సుమారు 80 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అయితే వర్షానికి తడిచిన ధాన్యం ఎండకు ఆరబెట్టి మిల్లులకు తరలిస్తున్నారు. ఏదేమైనా ధాన్యం కొనుగోళ్లు ఇంత సులభంగా ఉండడం ఎంతో ఆనందంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మిల్లులకు ట్రాక్టర్‌పై తరలిస్తున్న ధాన్యం బస్తాలు



గిడుతూరు గ్రామంలో తడిచిన అరబెట్టిన ధాన్యం

650 మెట్రిక్ టన్నుల ధాన్యం కోనుగోలు లక్ష్యం

రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించుకోవచ్చని వ్యవసాయ అధికారి చిరంజీవి తెలిపారు. ఈ ఏడాది 650 మెట్రిక్ టన్నుల ధాన్యం కొపేగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. కోనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఇప్పటవరకు సుమారు 80 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఆయన తెలిపారు.

గత ఐదేళ్లూ చాలా ఇబ్బందులు పడ్డాం

-లాలం అప్పలనాయుడు, గిడుతూరు



ధాన్యం అమ్ముకోవడానికి గత ఐదేళ్లూ చాలా ఇబ్బందులు పడ్డాం. గ్రామ సచివాలయానికి శుక్రవారం ధాన్యం శాంపిల్ ఇచ్చాం. శనివారం మిల్లుకు తరలించుకోమని చెప్పారు. దీంతో శనివారం మధ్యాహం 33.6 క్వింటాలు ధాన్యం గిడుతూరులో ఉన్న మిల్లుకు తరలించాను. సోమవారం రూ.77,280 ఖాతాలో పడ్డాయి. దీంతో ఎంతో ఆనందంగా ఉంది. గత ఐదేళ్లూ పరిస్థితులు ఇంత సులభతరంగా లేవు.

నూతన సంవత్సర వేడుకలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు దూరం

నర్సీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడకలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు దూరంగా ఉండాలని నిర్ణయించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి డిసెంబరు 26 నుంచి జనవరి 1వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంతాప దినాలను ప్రకటించాయి. ఒకటో తేదీన వ్యక్తిగతంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి ఎవరూ రావద్దని స్పీకర్ కోరారు.

వినతుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: ఆర్డీవో రమణ

నర్సీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను పరిశీలించి సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వివిధ శాఖల అధికారులకు ఆర్డీవో వీవీ.రమణ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 11 వినతిపత్రాలు వచ్చినట్టు ఆయన చెప్పారు. అత్యధికంగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

పౌర హక్కుల రక్షణకు బాధ్యత అవసరం

దేవరాపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) పౌర హక్కుల పరిరక్షణకు బాధ్యత అవసరమని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి చెప్పారు. మండలంలోని వాకపల్లి గ్రామంలో సోమవారం పౌర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ పౌర హక్కులను పొందడమే కాకుండా వాటిని కాపాడాలన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించినా, జరిపినా నేరమన్నారు. జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కేవీ.రమణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ గంగునాయుడు, జనసేన నాయకుడు గుమ్మిడి శ్రీరాం పాల్గొన్నారు.

హద్దులు దాటితే కేసులు తప్పవు

గొలుగొండ/కృష్ణాదేవిపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రజలు హద్దులు దాటి ప్రవర్తిస్తే కేసులు తప్పవని కృష్ణాదేవిపేట, గొలుగొండ ఎస్‌ఐలు తారకేశ్వరరావు, రామారావు హెచ్చరించారు. సోమవారం విలేకర్లతో వారు మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకరంగా, ఆమోదయోగ్యంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, సామాన్య ప్రజలను భయాభ్రాంతులకు గురిచేసేలా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. మంగళవారం అర్ధరాత్రి రోడ్డుపై హద్దులుమీరి వాహనాలు నడిపినా, గుంపులుగా చేరినా, కేకలు వేసినా బాణసంచా పేల్చినా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

సంప్రదాయాలపై వక్తృత్వ పోటీలు

చోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయాలు, పండగల విశిష్టత అనే అంశంపై అనకాపల్లి చైతన్య టెక్నో స్కూల్‌లో వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని శ్రీలేఖ విజేతగా నిలిచింది. శ్రీలేఖను ఉపాధ్యాయులు అభినందించారు.

రాయపురాజుపేటలో పల్లె వనం

చోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయపురాజుపేట పంచాయతీలో ఉపాధి పథకం కింద సోమవారం పల్లెవనం కార్యక్రమం నిర్వహించారు. భూలోకమాంబ ఆలయం సమీపంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వనంలో కొబ్బరి, జామ, నేరేడు, చింత, టేకు, ఉసిరి తదతర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

కె.కోటపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో అవసరమైన చోట్ల రోడ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని గుల్లేపల్లి గ్రామ టీడీపీ నాయకులు సోమవారం కలిసి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు తంగేటి ముత్యాలు, నాయకులు చుక్క ఈశ్వరరావు, గొర్లె అప్పలనాయుడు, గంటా రమణ, చుక్క పెంటయ్య పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టుల కొరత

అభివృద్ధి పనులపై కొరవడుతున్న పర్యవేక్షణ

నాతవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలను ఇంజనీరింగ్ అసిసెంట్ పోస్టుల కొరత వేధిస్తోంది. మండల వ్యాప్తంగా 17 సచివాలయాలు ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఎంబీపట్నం, గన్నవరం, గొలుగొండపేట, మన్నపురట్ల, వల్లంపేట, చెర్లోపాలెం, శృంగవరం, చమ్మచింత, గునుపూడి నాతవరం-1, నాతవరం-2 వైడిపేట సచివాలయాలలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఒక్కో ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెండు, మూడు సచివాలయాల్లో అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. ఫలితంగా మండలంలో జరిగే అభివృద్ధి పనుల నాణ్యతపై పర్యవేక్షణ కొరవడుతోంది. పీఆర్ ఏఈ వెంకటేశ్వరమ్మ పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో చేపట్టే పనులు నాణ్యంగా జరగాలంటే ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



క్యాలెండర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు, నాయకులు

యువ కార్యకర్తలకు అండగా ఉంటా..

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసే యువ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు భరోసా ఇచ్చారు. టీడీపీ పట్టణ యువ నేత, గోవాడ షుగర్స్ మాజీ ఛైర్మన్ సకురు పెంటారావు తనయుడు సకురు కోటేశ్వరరావు నియోజకవర్గంలోని టీడీపీ అభిమానులు, కార్యకర్తల కోసం రూపొందించిన 2025 క్యాలెండర్‌ను పార్టీ కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీకి కోటేశ్వరరావు లాంటి యువ నేతల అవసరం ఉందని, పార్టీపై వారు చూపుతున్న అభిమానం అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తలకు చంద్రబాబు, లోకేశ్ ఆశీస్సులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు నాయుడు, చిన్న, టి.శ్రీను పాల్గొన్నారు.

ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సోమవారం అందజేశారు. చోడవరం క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తారువ గ్రామానికి చెందిన కైచర్ల సింహాచం నాయుడు రూ.1.69 లక్షలు, ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కర్రి అప్పలనర్సకు రూ.40 వేల నగదును చెక్కు రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డిరామానాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, నాయకులు ఎ.శ్రీను, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

చోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983-64 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు వెంకన్నపాలెంలో సోమవారం కలుసుకున్నారు. మూడు దశాబ్దాల తరువాత ఒక్కచోట చేరిన వీరంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. తమ బ్యాచ్‌లో వివిధ రంగాలలో ప్రముఖ స్థాయికి ఎదిగిన స్నేహితులను సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, ఎస్ఐ ఎం.వి.రమణ, పశు సంవర్థక శాఖ ఏడీ రామకృష్ణ, కస్టమ్స్ అధికారి డి.రవీంద్ర, స్వయంభూ గౌరీశ్వరాలయం ఛైర్మన్ గూనూరు సురేశ్, సామాజిక కార్యకర్త సోంబాబు, ఇండస్ట్రియల్ ఛైర్మన్ ఏఎస్ ప్రసాద్‌లను సత్కరించి గౌరవించారు.

గ్రామాల్లో శాశ్వత పనులు చేయండి

మాకవరపాలెం, డిసెంబరు 30: గ్రామాల్లో ప్రజలకు శాశ్వతంగా గుర్తు ఉండిపోయే అభివృద్ధి పనులను చేయాలని తహసీల్దార్ రామారావు సూచించారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో సుమారు రూ.10 లక్షలతో చేపట్టిన భారీ సిమెంటు డ్రైన్లు పనులను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అలాగే సంక్రాంతికి గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పనులు జోరందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ ఎ.రామునాయుడు పాల్గొన్నారు.

ఏపీఎఫ్‌సీసీఐ ఉమ్మడి విశాఖ కార్యదర్శిగా సుతాపల్లి శ్రావణ్



నర్సీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శిగా నర్సీపట్నానికి చెందిన సుతాపల్లి శ్రావణ్‌ను నియమించామని ఏపీఎఫ్‌సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ్ నియామకంపై పట్టణంలోని పలువురు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

కులవివక్షకు దూరంగా ఉండండి

చీడికాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కులవివక్షకు అందరూ దూరంగా ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. మండలంలోని జైతవరం ఎస్సీ కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి కులవివక్ష లేకుండా కలిసిమెలిసి ఉండాలని కోరారు. అంతకుముందు ఎస్సీ కులస్థులు తెలిపిన పలు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సదస్సులో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు ఈశ్వరరావు, హెచ్‌సీ గోవింద, పంచాయతీ కార్యదర్శి నవీన్, వీఆర్‌వో కొండలరావు పాల్గొన్నారు.

వినికిడి పరీక్షలకు పోటెత్తిన రోగులు

- 560 ఓపీ నమోదు.. 120 మందికి స్క్రీనింగ్
- పరికరాల పంపిణీకి 40 మంది ఎంపిక
- మరిన్ని రోజులు శిబిరం నిర్వహణకు ఓకే

నర్సీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వినికిడి పరీక్షల వైద్య శిబిరానికి రోగులు పోటెత్తారు. సోమవారం ఏరియా ఆస్పత్రి సమీపం, పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వినికిడి పరికరాలు పంపిణీ కోసం స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. అధికారులు ఊహించని విధంగా నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి 560 మంది రోగులు ఓపీకి తరలి రావడంతో ఆస్పత్రి కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇద్దరు ఆడియో మెట్రిస్టులు 120 మందికి మాత్రమే వినికిడి పరీక్షలు నిర్వహించగలిగారు. మిగిలిన రోగుల ఫోన్ నంబర్లు అధికారులు తీసుకున్నారు. రోజుకి 40 మందికి ఫోన్లు చేసి రప్పించి వినికిడి పరీక్షలు చేయడానికి పీవో ఎన్‌సీడీ డాక్టర్ ప్రశాంతి చర్యలు తీసుకున్నారు. మరికొన్ని రోజులు వైద్య శిబిరం కొనసాగించడానికి డీఎంహెచ్‌వో నుంచి అనుమతి తీసుకున్నారు. అదనంగా వినికిడి పరికరాలు అవసరం పడతాయని దీనదయాల్ శ్రావణ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ శిబిరంలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఆర్. వరప్రసన్న, డాక్టర్ కనక మహాలక్ష్మి, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ క్రాంతి, డాక్టర్ పృథ్వీ, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ధనుంజయ, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.





ఆస్పత్రి ఎదుట గుమిగూడిన రోగులు... వినికిడి పరీక్ష చేస్తున్న ఆడియో మెట్రిస్ట్

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్

- ఉత్తమ అంశాలకు అవార్డులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్

చోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అందరినీ ఆలోచింపజేశాయి. మండల స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 14 పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సైన్స్, మేథ్స్ సబ్జెక్టులకు సంబంధించి నిర్వహించిన ఈ సైన్స్‌ఫెయిర్‌లో వివిధ ఉన్నత పాఠశాలలు పలు ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. ఎంఈవోలు తిరుపతిరావు, సింహాచలం నాయుడు సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

కొత్తూరు బాలికల పాఠశాలకు ఐదు బహుమతులు

ఈ సైన్స్‌ఫెయిర్‌లో కొత్తూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు వివిధ విభాగాల్లో ఐదు బహుమతులన సొంతం చేసుకున్నారు. గణితంలో వ్యక్తిగత కేటగిరీలో లక్ష్మీపురం హైస్కూల్‌కు ప్రథమ స్థానం, కొత్తూరు బాలికల హైస్కూల్‌కు ద్వితీయ స్థానం, గౌరీపట్నం హైస్కూల్‌కు తృతీయ స్థానం దక్కాయి. గణితం గ్రూప్ విభాగంలో గౌరీపట్నం, లక్ష్మీపురం, జుత్తాడ పాఠశాలల విద్యార్థులకు వరుస మూడు స్థానాలు సాధించారు. అలాగే ఉపాధ్యాయుల కేటగిరీలో కొత్తూరు బాలికల ఉన్నత పాఠశాలకు ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. ఫిజిక్స్ గ్రూప్ విభాగంలో జుత్తాడ, లక్ష్మీపురం, కొత్తూరు పాఠశాలలకు వరుస మూడు స్థానాలు లభించాయి. ఉపాధ్యాయుల విభాగంలో కొత్తూరు బాలికల హైస్కూల్ టీచర్‌కు ప్రథమ స్థానం లభించింది. బయోసైన్స్‌లో విద్యార్థుల గ్రూపు విభాగంలో చోడవరం, పీఎస్‌పేట, కేజీబీవీ హైస్కూల్స్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా, వ్యక్తిగత కేటగిరీలో లక్ష్మీపురం, గౌరీపట్నం, గవరవరం హైస్కూళల వరుస స్థానాలు లభించాయి. ఉపాధ్యాయుల కేటగిరీలో కొత్తూరు, జ్యోతిబాపూలే పాఠశాలలకు ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. కార్యక్రమంలో విద్యార్థులు 54 ప్రాజెక్టులు, ఉపాధ్యాయులు 12 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారు. హెచ్‌ఎం ఐ.వీ.రామిరెడ్డి, పలు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, గణితం, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎంఈవోలు తిరుపతిరావు, సింహాచలం బహుమతులు అందించారు.

గ్రామీణ విద్యార్థులకు తెలుగుపై పట్టు అవసరం

- ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ రాజశేఖర్

చోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులు ఐఐటీతో పాటు ఇతర ఉన్నత విద్యాకోర్సులకు ఎంపికయ్యేందుకు ముందుగా మాతృబాష తెలుగుపై పట్టు పెంచుకోవాలని ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జీపీ.రాజశేఖర్ సూచించారు. జె.రమణాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యావకాశాల పేరిట, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఉషోదయ కాలేజీలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృబాషపై పట్టు సాధించడం ద్వారా సబ్జెక్టులపై అవగాహన పెరుగుతుందన్నారు. ఆత్మన్యూనత తొలగించుకుంటే ఉన్నత విద్యా కోర్సులు సాధించగలరని తెలిపారు. ఐఐటీ, ఇతర ఉన్నత విద్యా కోర్సులను లక్ష్యంగా పెట్టుకుని ఒక క్రమ పద్ధతిలో చదువు కొనసాగించడం ద్వారా విద్యార్థులు ప్రతిబంధకాలను సులభంగా అధిగమించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు ఆయన విపులంగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు నియోజకవర్గాల్లోని ఐఐటీలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ప్రొఫెసర్ బహుమతులు అందచేశారు. గ్రామీణ ప్రాంతంలో ఇటువంటి కార్యక్రమాలకు రూపకల్పన చేసిన చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రమణాజీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీన్ వాసు, రెండు నియోజకవర్గాలకు చెందిన హైస్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐఐటీ ప్రొఫెసర్ రాజశేఖర్

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

- ఎంపీపీ రెడ్డి జగన్మోహన్

కె.కోటపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన గ్రీన్‌హౌస్ మానిటరింగ్ సిస్టం, వ్యక్తిగత విభాగంలో ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, వాటర్ డిస్పెన్సర్‌లో ఉపాధ్యాయ విభాగం, ఎ.కోడూరు హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు రమేశ్ ప్రదర్శించిన మోడల్‌కు బహుమతులు లభించాయి. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సూక్ష్మ దృష్టితో విషయాలు తెలుసుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత డోకల నరసింహమూర్తి, హెచ్‌ఎం ఎస్వీపద్మావతి, ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, నోడల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, సైన్స్ ఉపాధ్యాయులు ఎర్రి నాయుడు, కామేశ్వరరావు, నారాయణ, మురళీకృష్ణ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తులు

నర్సీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ సోమవారం సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతూ నేరాలు చేసి జైలుకు రావడంతో కుటుంబీకులు ఇబ్బంది పడతారని చెప్పారు. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరిలో పరివర్తన రావాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జి మధుసూదనరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రోహిత్, న్యాయవాది ఎం.గోవర్ధన పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ధర్నా



కోర్టు సముదాయం ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

నర్సీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సివిల్ కేసులో తలదూర్చి న్యాయవాది వీవీ.శేషాద్రి గుండెపోటుతో చనిపోవడానికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోర్టు సముదాయం ఎదుట న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెట్టా ప్రభాకర్, అనిమిరెడ్డి శివకృష్ణ మాట్లాడుతూ సివిల్ కేసు గురించి మాట్లాడటానికి న్యాయవాది శేషాద్రిని అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు రప్పించారని తెలిపారు. సివిల్ కేసు పోలీసులకు సంబంధం లేదని చెప్పినా న్యాయవాదిని మానసిక ఒత్తిడికి గురి చేశారని, దీంతో అతను గుండెపోటుతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశాఐ. దీనికి కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేఆర్‌వీ.సత్యనారాయణ, చింతల ప్రకాశ్, కామిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలు... సంకల్పాలు



గత ఏడాది చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం తప్పనిసరి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'కాలం నీతో నడవదు. నిన్నడిగి ముందుకు సాగదు. సంకల్పం ఒక్కటే చాలదు. దానికి సమయమే కదరా ఆయుధం'...అంటూ సాగే ఈ పాట కాలం విలువను తెలియజేస్తుంది. జీవితంలో ప్రతి క్షణమూ విలువైనదే. పోయిన కాలాన్ని వెనక్కి తిరిగి తీసుకురాలేమనేది ఈ పాట సారాంశం. అయితే, అతికొద్దిమంది మాత్రమే కాలం విలువను గుర్తిస్తున్నారు. ఎక్కువమంది సమయాన్ని వృథా చేస్తున్నారు.

ఎప్పటి మాదిరిగానే మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త ఏడాది ప్రతి ఒక్కరి మదిలో అనేక ఆలోచనలు మెదులుతుంటాయి. అప్పటివరకు నిరుత్సాహంతో ఉండే వారికి కొత్త ఏడాది వస్తోందంటే చాలు ఉత్సాహం కట్టలు తెచ్చుకుంటుంది. కొత్త ఆలోచనలు, సంకల్పాలు మెదడును తట్టిలేపుతుంటాయి. 'ఇకపై మారాలి' అంటూ నిర్ణయం తీసుకునే వారి సంఖ్య తక్కువేమీ కాదు. అటువంటి వారంతా కొత్త ఏడాది నుంచి ఎలాంటి ఆలోచనలతో ముందుకువెళ్లాలి. తీసుకునే నిర్ణయాలను ఎలా ఆచరణలో పెట్టాలి అన్నది చాలా ముఖ్యం. న్యూ ఇయర్‌లో తీసుకునే కొత్త నిర్ణయాలు ఎలా ఉండాలి. వాటిని ఎలా అమలు చేయాలన్న దానిపై అందిస్తున్న ప్రత్యేక కథనం.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

జీవితంలో అన్నింటి కంటే విలువైనది కాలం. ఒకసారి కరిగిపోయిన కాలాన్ని వెనక్కి తీసుకురాలేము. రోజులో ఎవరికి అయినా 24 గంటలే ఉంటాయి. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వాళ్లు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తుంటారు. అటువంటి కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు ఉండాలి. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకు ఎంత సమయాన్ని సద్వినియోగం చేసుకుటున్నామన్నది చాలా ముఖ్యం. వేకువజామునే నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలి. అప్పటి నుంచి రాత్రి పడుకునేంత వరకు ఉన్న సమయాన్ని లెక్కగట్టి ఒక్కో పనికి కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఈ మేరకు షెడ్యూల్ వేసుకోవాలి.

నిర్దిష్టమైన లక్ష్యాలు అవసరం..



కొత్త ఏడాదిలో తీసుకునే రెజల్యూషన్స్ నిర్దిష్టంగా ఉండాలి. మరీ ఎక్కువ నిర్ణయాలు తీసుకున్నా వాటిని అమలు చేయడం కష్టంగా ఉంటుంది. కాబట్టి తీసుకునే నిర్ణయాలపై స్పష్టత అవసరం. అమలుకు ప్రణాళిక ముఖ్యం. కాల పరిమితి తక్కువగా పెట్టుకోవాలి. దానివల్ల లక్ష్యాన్ని సాధించే ప్రణాళికలు బలంగా ఉండడంతోపాటు ఆకాంక్ష, పట్టుదల దృఢంగా ఉంటాయి.

పొదుపు మంత్రం



ప్రస్తుతం ప్రతి అవసరానికి డబ్బు అవసరం పడుతోంది. కాబట్టి, పొదుపు మంత్రాన్ని పాటించడం అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నెలవారీ వచ్చే ఆదాయాన్ని, ఖర్చులను లెక్క చూసుకుని కనీసం 20 నుంచి 30 శాతం పొదుపు/మదుపు చేసేలా ప్రణాళికలు వేసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. పొదుపు ఆర్థిక క్రమశిక్షణతోనే సాధ్యపడుతుంది. అనవసరపు ఖర్చులు, ఆర్భాటాలు, ఎదుటివారితో పోల్చుకుని బతకాలనే కోరెలు అప్పులు పాలయ్యేలా చేస్తాయని, ఇటువంటి వాటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ నిర్ణయాలు తప్పనిసరి..

కొత్త ఏడాదిలో తీసుకునే నిర్ణయాల్లో తప్పనిసరిగా కొన్ని ఉండాలని నిపుణులు బలంగా సూచిస్తున్నారు. దురలవాట్లు కలిగి ఉన్నవారు వాటికి దూరంగా ఉండడం కీలకంగా చెబుతున్నారు. స్మోకింగ్, ఆల్కహాల్, బెట్టింగ్, ఆరోగ్యానికి, జీవితానికి హాని కలిగించే ఇతర అలవాట్లకు దూరంగా ఉండాలి. వీటి బారినపడేందుకు కారణమయ్యే స్నేహాలను కూడా అవసరమైతే కొత్త ఏడాదిలో విడిచిపెట్టాలి. దురలవాట్ల వల్ల ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. కొత్త ఏడాదిలో ఇటువంటి అలవాట్లకు దూరంగా ఉండాలనే నిర్ణయాన్ని తీసుకోవాలి.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం..



ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అన్నీ ఉన్నా ఆరోగ్యం లేకపోతే చాలా కష్టం. కాబట్టి, ఆరోగ్యంపై దృష్టిసారించేలా నిర్ణయాలు తీసుకోవాలి. ఉరుకులు, పరుగులు జీవితంలో చాలామంది ఎప్పుడు తింటున్నారో, ఏం తింటున్నారో, ఎప్పుడు పడుకుంటున్నారో, ఎప్పుడు నిద్ర లేస్తున్నారో కూడా తెలియడం లేదు. కాబట్టి,

- సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకమంటున్న నిపుణులు
- ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం

ఆహారం, వ్యాయామం విషయంలో కొన్ని కీలక నిర్ణయాలను తీసుకోవడం చాలా అవసరం. బయట ఆహారానికి దూరంగా ఉండడం, ఉదయాన్నే లేచి వాకింగ్, జాగింగ్ వంటివి చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేసినట్టు అవుతుంది.

మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా..

ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో ఒత్తిడి సర్వసాధారణమైంది. ఒత్తిడి వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒత్తిడి నుంచి దూరంగా ఉండేందుకు జీవితంలో యోగా, వ్యాయామం, మెడిటేషన్ వంటివి భాగం చేసుకోవాలి. పుస్తకాలు చదవడం, కొత్త ప్రదేశాలకు వెళ్లడం వల్ల ఉత్సాహంగా ఉండే అవకాశముంది. సమయానికి భోజనం చేసేలా, తగినంత నిద్ర ఉండేలా తీసుకోవాలి.

నిత్యాన్వేషిలా ఉండాలి..

చదువుతున్నా, ఉద్యోగం చేస్తున్నా కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. అందుకు కొంత సమయం కేటాయించాలి. ప్రతి రంగంలోనూ పోటీ ఉంది. కాబట్టి, నిరంతర అధ్యయనంతోనే ఆయా రంగాల్లో సుదీర్ఘకాల కొనసాగేందుకు అవకాశముంటుంది. ఆ దిశగా కొత్త ఏడాదిలో నిర్ణయం తీసుకోవడం ఉద్యోగ భద్రతకు అవకాశముంటుంది.

నిర్ణయాలు అమలు చేయాలంటే...

కొత్త ఏడాదిలో తీసుకునే నిర్ణయాలను అమలు చేసే వారి సంఖ్య అతి స్వల్పమనే చెప్పాలి. అతికొద్దిమంది మాత్రమే పూర్తిస్థాయిలో అమలు చేస్తుంటారు. తీసుకున్న నిర్ణయాలను ఆచరించేందుకు ముందు మనసును సిద్ధం చేసుకోవాలి. గత ఏడాది తీసుకున్న నిర్ణయాల్లో అమలు చేసినవి ఎన్ని, చేయలేకపోయినవి ఎన్ని, దానికి గల కారణాలను విశ్లేషించుకుని వాటిని అధిగమించే ప్రయత్నం చేయాలి. సాధించగలిగే, తక్కువ లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. లక్ష్యాలను ఒక బోర్డుపై రాసుకోవాలి. తీసుకున్న నిర్ణయాలతో ఇతరులతో పంచుకోవడం వల్ల సాధించాలన్న తపన పెరుగుతుంది. నిర్ణయాలపై ప్రతి వారం, నెల సమీక్షించుకుని ముందుకువెళ్లాలి.

సమయాన్ని సద్వియోగం చేసుకోవాలి

- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి



సమయం అనేది అత్యంత విలువైనది. దానిని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలి. ఈ క్రమంలో అనేక ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. వాటిని ఇష్టంగా ఎదుర్కొంటూ ముందుకుసాగాలి. గడిచిన ఏడాది తీసుకున్న నిర్ణయాల్లో ఎన్ని అమలు చేశారు. ఎన్నింటిలో విఫలమయ్యారో గుర్తించాలి. అటువంటి వాటిని చేరుకునేందుకు అవరోధంగా నిలిచిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి ముందుకు సాగడం ద్వారా ఈ ఏడాదిలో విజయం సాధించవచ్చు. సమయాన్ని సద్వినియోగం చేసుకునేవాళ్లు జీవితంలో విజయాలను సాధించగలుగుతారు.

నెలవారీ లక్ష్యాలను పెట్టుకోవాలి

- పూజిత జోస్యుల, మానసిక నిపుణులు



కొత్త ఏడాది అనగానే చాలా మంది పెద్ద పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటారు. దానివల్ల ప్రయోజనం ఉండదు. స్వల్ప లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. ఏం చేస్తామనే దానికంటే ఏం చేయకూడదు అనుకుంటున్నారో వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారించి అమలు చేయాలి. దీర్ఘకాలిక లక్ష్యాల కంటే నెలవారీ లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని అమలు చేసుకోవాలి. మినీ గోల్ అప్రోచ్‌తో మంచి ఫలితం ఉంటుంది. ఉదాహరణకు ఈ నెలలో స్మోకింగ్, మద్యం వంటి వాటికి దూరంగా ఉంటాను అని నిర్ణయించుకుని వాటిని అమలు చేసుకోవాలి. ఎమోషనల్, సోషల్, టైమ్ బౌండరీలు పెట్టుకోవాలి. హెల్దీ రెజల్యూషన్స్ కూడా ఉండాలి. అంటే పుస్తకాలు చదవడం వంటివి కూడా లక్ష్యాలుగా పెట్టుకోవాలి.

పీహెచ్‌సీ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- విచారణ జరిపిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

రోలుగుంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రోలుగుంట పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన రోలుగుంటకు చెందిన వైదాసు లక్ష్మి కుటుంబ సభ్యులు సోమవారం ఆరోగ్య కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోలుగుంట గ్రామానికి చెందిన వైదాసు లక్ష్మి(59) శనివారం రాత్రి శ్వాసతీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు పీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు లేని కారణంగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం, అక్కడికి తీసుకువెళ్లే లోగా ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై 'రోలుగుంట పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యంతో మహిళ మృతి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో జిల్లా వైద్యాధికారి స్పందించారు. విచారణకు నర్సీపట్నం డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతిని ఆదేశించారు. దీంతో ఆమె సోమవారం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు ఆరోగ్య కేంద్రం ఎదుట బైఠాయించారు. మృతురాలి బంధువులతో డిప్యూటీ డీఎంహెచ్‌వో చర్చించారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ లక్ష్మి మృతి బాధాకరమని, ఆ రోజు డ్యూటీలో ఉన్న సిబ్బందిని విచారించి నివేదిక తయారు చేశామన్నారు. అలాగే సీసీ కెమెరాల ఫుటేజీని కూడా తీసుకుని దాని ఆధారంగా కూడా పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం అని విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విచారణ నివేదికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి అందజేస్తామని చెప్పారు.



రోలుగుంట ఆరోగ్య కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



డిప్యూటీ డీఎంహెచ్‌వో తో మాట్లాడుతున్న బాధితులు

క్రైం... crime news

రోడ్డు ప్రమాదం కేసులో ట్రాక్టర్ డ్రైవర్ అరెస్టు

సబ్బవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో అమ్ములపాలెం జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి బైక్‌ను ఢీకొని టైలర్ మృతికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌ను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. గవరవారి కొంపలకు చెందిన బలిరెడ్డి శేషుబాబు ఆదివారం రాత్రి అనకపల్లి వైపు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతున్నాడు. ఇదే సమయంలో నారపాడు శివారు బలిజపాలెం గ్రామానికి చెందిన కోసూరు సూర్యారావు, భార్య మంగమ్మతో కలసి బైక్‌పై వస్తున్నాడు. అమ్ములపాలెం జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో సూర్యారావు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌ను సోమవారం అరెస్టు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్టు సీఐ చెప్పారు.

గంజాయి రవాణా కేసులో నిందితుడి అరెస్టు

సబ్బవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో చాలా కాలం నుంచి పరారీలో వున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. 2022 జూలై 14వ తేదీన సబ్బవరం మీదుగా గంజాయి తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా జి.మాడుగుల మండలం జీలుగుగొయ్యికి చెందిన బంటారి మోదేశ్వరరావు పరారయ్యాడు. సోమవారం ఉదయం చోడవరం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా మోదేశ్వరరావును పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు.

వైసీపీ నేతల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

నాయకుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు కుమారులు కొద్దిరోజులుగా సూటిపోటి మాటలతో రెచ్చగొడుతున్నారు. సోమవారం మణికంఠ, అతని సోదరుడు శ్రీనివాసరావు వడ్డాదిలో ఉండగా, వారిని ఉద్దేశించి వైస్ ఎంపీపీ కుమారులు హేళనగా మాట్లాడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించారు. మణికంఠ వారిని నిలదీయగా, అక్కడ ఉన్న కొందరు గొడవ పెరగకుండా సర్దుబాటు చేశారు. అనంతరం మణికంఠ, అతని సోదరుడు బైక్‌పై దిబ్బిడి బయలుదేరారు. వెంటనే వైస్ ఎంపీపీ కుమారులు కూడా బయలుదేరి, టీడీపీ వారికంటే ముందుగానే గ్రామ శివారుకు చేరుకున్నారు. అప్పటికే తమ వర్గీయులకు సమాచారం అందించడంతో వైస్ ఎంపీపీ చినబాబుతోపాటు అతని సోదరుడి కుమారులు అక్కడకు వచ్చారు. కొద్దిసేపటి తరువాత బైక్‌పై వస్తున్న మణికంఠ, అతని సోదరుడిని అడ్డగించి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మణికంఠ తలకు తీవ్రగాయాలు కాగా, శ్రీనివాసరావు పళ్లు విరిగిపోయాయి. ఇరువురినీ స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పార్టీ నాయకులపై వైసీపీ నేతలు దాడి చేసినట్టు తెలియడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. దాడికి పాల్పడిన వైసీపీ నేతలపై బుచ్చెయ్యపేట పోలీసులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587. ఈ పర్యాయం స్వల్పంగా పెరిగారు.

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గత నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఆ ప్రక్రియ ముగియడంతో సోమవారం ఎన్నికల అధికారి తుది జాబితా విడుదల చేశారు. గత నెల 23న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 15,297 మంది ఓటర్లు ఉండగా అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా 19 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కొత్తగా పురుషులు 3,325, మహిళలు 2,962 మంది వెరసి 6,287 మంది దరఖాస్తు చేయగా పరిశీలించి అందరినీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఇదిలావుండగా వచ్చే ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత మరోసారి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వనున్నది.

హాస్టళ్లకు నిధులు!

... 5వ పేజీ తరువాయి

వసతి గృహానికి రూ.13 లక్షలు, నాతవరంలో బాలుర వసతి గృహానికి రూ.16 లక్షలు, చమ్మచింతలో బాలుర వసతి గృహానికి రూ.12 లక్షలు, గొలుగొండలో బాలుర వసతి గృహానికి రూ.17 లక్షల చొప్పున మొత్తం రూ.3.16 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో వసతిగృహాల్లో విద్యుత్ వైరింగ్ పనులు, కిటికీలకు రెక్కలు, గుమ్మాలకు మర్మతులు, గదుల్లో సిమెంటు పనులు చేపట్టనున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604



పౌర హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శ



మాట్లాడుతున్న జె.వి.సత్యనారాయణమూర్తి

తుమ్మపాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పౌరుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాల రాస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. సోమవారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారాన్ని చేపట్టిన బీజేపీ ప్రభుత్వం.. ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తూ, పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తుంగలో తొక్కుతున్నదని ధ్వజమెత్తారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అగౌరవపరుస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏకంగా పార్లమెంటులోనే మాట్లాడడం అత్యంత దారుణమన్నారు. అమిత్ షా తీరును ప్రతిపక్షాలు తప్పుపడుతుంటే, బీజేపీ నేతలు ఎదురు దాడికి దిగడం శోచనీయమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతన్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టమాటా ధర పతనం

... 5వ పేజీ తరువాయి

మార్కెట్‌కు టమాటా రాకపెరుగుతుండడంతో ధరలు పడిపోతున్నాయి. సోమవారం కృష్ణాదేవిపేట మార్కెట్‌కు పలు గ్రామాల రైతులు పెద్ద ఎత్తున టమాటాలు తీసుకువచ్చారు. క్రేటు (సుమారు 30 కిలోలు) టమాటాలు రూ.250కి మించి ధర పలకలేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. కాయ కోత కూలి, రవాణా చార్జీలు, సంతలో ఆశీలు కలుపుకుంటే టమాటాలు అమ్మగా వచ్చే ఆదాయంలో సగం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం క్రేట్ టమాటాలు రూ.650 పలికాయని, ఇంతలోనే మూడో వంతుకు ధర పడిపోయిందని వాపోయారు.

